సంక్రాంతి సందడి

- పల్లెల్లో పండగ శోభ
- సొంతూళ్లకు చేరుకున్న వలసవాసులు
- పిండివంటల తయారీలో మహిళలు బిజీ

పల్లెటూళ్లలో సంక్రాంతి పండగ శోభ సంతరించుకుంది. భోగి పండగ సందర్భంగా భోగి మంటలు వేసేందుకు యువత తాటాకులు, రేగికంప, ఇతర సామగ్రిని సేకరించి సిద్ధం చేశారు. ఇళ్లకు సున్నాలు, రంగులు వేయించి మహిళలు తమ లోగిళ్లను రంగవల్లులతో అందం తీర్చిదిద్దారు. పండగ సందర్భంగా చేసిన పిండివంటల ఘుమఘుమలు నోరూరిస్తున్నాయి. సంక్రాంతి రోజున పెద్దల పండగ జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. కనుమ రోజున పశువుల పండగ నిర్వహించేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ పండగ మూడు రోజుల్లో అభ్యంగన స్నానాలు ఆచరించి కొత్త దుస్తులు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పండగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసేందుకు యువత, చిన్నారులు పతంగులను కొనుగోలు చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లిన వారు సంక్రాంతి పండగను తమ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తుల మధ్య ఆనందంగా జరుపుకునేందుకు సొంతూళ్లకు చేరుకోవడంతో పల్లెలో పండగ సందడి నెలకొంది.

– కోవూరు



సంక్రాంతికి తయారుచేస్తున్న పిండివంటలు



గాలిపటాలు ఎగురవేసేందుకు సిద్ధమవుతున్న యువత



భోగి మంట కోసం బైక్‌పై తాటాకులు తెస్తున్న దృశ్యం



ఇంటి ముంగిట్లో తీర్చిదిద్దిన భోగి కుండల ముగ్గు

యువతకు క్రీడలు ఎంతో అవసరం

పొదలకూరు: యువతకు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతాయని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.సంగమేశ్వరరావు అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని పట్టణానికి సమీపంలో సంగం రోడ్డు మైదానంలో శుక్రవారం ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో ఆర్గనైజర్ ఎం.రవికుమార్‌యాదవ్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు గత 15 ఏళ్లుగా ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్గనైజర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతుల అందజేస్తామని. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ ఆల్‌రౌండర్‌లకు ప్రత్యేక బహుమతులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కే కరిముల్లా, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి, ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు పి.బాలకృష్ణ, మనోహర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ సంగమేశ్వరరావు

పశుపోషణలో మెలకువలు పాటించాలి

- పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు

ఇందుకూరుపేట: పశుపోషణలో మెలకువలు పాటించాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ మహేశ్వరుడు సూచించారు. మండలంలోని కొత్తూరు ప్రాంతీయ పశువైద్యశాలలో శుక్రవారం ఏడీ డాక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పాడి రైతులకు 'పశు విజ్ఞాన బడి' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జేడీ మాట్లాడుతూ పాడి రైతులు రైతుభరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువులకు ఈతల మధ్య వ్యవధి తగ్గించి చూడు కట్టిస్తే ఏడాదికి ఒక దూడను పొందవచ్చన్నారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సోమయ్య మాట్లాడుతూ పెయ్యదూడల ఉత్పత్తి, వైఎస్సార్ బీమా పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, లేబూరు వెంకురెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీ మహేశ్వరుడు

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో వెలసిన శ్రీచాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద వితరణకు హైదరాబాద్‌కు చెందిన ఆములూరు గోపీకృష్ణ – శారదమ్మ దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ నగదు చెక్కును శుక్రవారం ఆలయ ఆవరణలో కార్యనిర్వాహణాధికారి బండి శాంతయ్యకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఈఓకు చెక్ అందజేస్తున్న దాతలు

భవన నిర్మాణాలు పూర్తి చేయండి

కొడవలూరు: నిర్మాణంలో ఉన్న సచివాలయ, రైతు భరోసా కేంద్రాల భవనాలు త్వరగా పూర్తయ్యేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. కొడవలూరులోని సచివాలయాన్ని శుక్రవారం సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. క్రమం తప్పకుండా నిర్మాణాల పురోగతిని పరిశీలించాలని తెలిపారు. జగనన్న విద్యాదీవెన వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్‌లపై ఉందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట సచివాలయ ఉద్యోగులు శ్రీకాంత్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరు మండలంలోని వావిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో 1997–2002 సంవత్సరాల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన విద్యార్థులు కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సందడి చేశారు. అప్పట్లో తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులతో గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తరగతి గదుల్లో చేసిన చిలిపిచేష్టలను గుర్తుచేసుకున్నారు.

అనంతరం ప్రస్తుతం పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రతిభావంతులకు బహుమతులు అందజేసి ఉపాధ్యాయులను సన్మానించారు.

అందరి జీవితాల్లో సంతోషం నిండాలి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం: సంక్రాంతి పండగ ప్రజలందరి జీవితాల్లో సంతోషం నింపాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు, అధికారులు, నాయకులు, కార్యకర్తలకు భోగి, సంక్రాంతి, కనుమ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో భోగభాగ్యాలు కలగాలని, సంక్రాంతి సంతోషాన్ని నింపాలని, కనుమ అన్నదాతలకు అష్టైశ్వర్యాలు కురిపించాలని ఆయన ఆకాంక్షించారు.

నేటి నుంచి షటిల్ పోటీలు ప్రారంభం

కోవూరు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న షటిల్ కోర్టులో ఈ నెల 14వ తేదీ నుంచి మూడు రోజులపాటు పెద్ది ప్రభావతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.నవీన్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ పోటీలు కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలాల స్థాయిలో జరుగుతాయని తెలిపారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులతోపాటు జ్ఞాపిక అందజేస్తామని తెలిపారు. వివరాలకు 80194 80480, 99663 66179, 90147 36166 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

నేటి నుంచి జిల్లాస్థాయి చెడుగుడు పోటీలు

తోటపల్లిగూడూరు: మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో శనివారం నుంచి రెండు రోజులపాటు జిల్లాస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తిరవళ్లూరు ఈశ్వరయ్య, కదురు వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆల్తూరి ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్, ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్‌ల అధినేతలు ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఆల్తూరి మహేష్‌రెడ్డి సంయుక్తంగా ఈ చెడుగుడు పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన పురుషులు, మహిళల జట్లకు నగదు బహుమతులు అందజేయడంతోపాటు అత్యుత్తమ క్రీడా ప్రదర్శన చూపిన క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు భోజన సదుపాయంతోపాటు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9440981992, 9704682519 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆయుర్వేద వైద్యుడి మృతి

శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో ఆయుర్వేద వైద్యుడు దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ అంజుయాదవ్ కథనం మేరకు కొడవలూరు మండలానికి చెందిన నరసింహులు(66) ఆయుర్వేదం వైద్యం చేస్తూ, జ్యోతిషం చెబుతూ జీవిస్తున్నాడు. శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనానికి వచ్చాడు. దర్శనానంతరం పొన్నాలమ్మ ఆలయం వద్ద అతడు నడచి వెళుతుండగా తమిళనాడుకు చెందిన బస్సు ఢీకొంది. ఈ ఘటనలో నరసింహులు అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ అంజుయాదవ్ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

మనుబోలమ్మకు పూజలు



పుష్పాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు: మనుబోలులోని గ్రామదేవత మనుబోలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు ఫణీంద్రశర్మ మనుబోలమ్మకు అభిషేకాలు, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి మనుబోలమ్మకు గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పంట నమోదుపై ఆసక్తి చూపాలి



సమావేశం నిర్వహిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు: పంట నమోదుపై రైతులు ఆసక్తి చూపాలని ఏఓ సీహెచ్ లక్ష్మి సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదుపై రైతులు ఆసక్తి చూపనందున నమోదు ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు. పంట నమోదు ఆవశ్యకతపై రైతుల్లో అవగాహన లేకపోవడం వల్లే ఆసక్తి చూపడం లేదన్నారు. సలహా మండలి సభ్యులు చొరవ చూపి రైతులకు అవగాహన కల్పించడం ద్వారా ప్రతి రైతు నమోదు చేయించుకోవడంతోపాటు ఈ కేవైసీ చేయించుకొనేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో సలహా మండలి సభ్యుడు కాకి శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ప్రకటన బోర్డుల ఏర్పాటు



నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ నిబంధనల మేరకే ప్రకటన బోర్డులను ఏర్పాటు చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రకటన బోర్డులకు సంబంధించిన పన్నులను వేగవంతంగా వసూలు చేయాలని సూచించారు. భారీ హోర్డింగ్‌ల ఏర్పాటు స మయంలో నాణ్యత ప్రమాణాలను యాడ్ ఏ జెన్సీలు పాటించేలా చర్యలు చేపట్టాలని చె ప్పారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కోర్టు కే సుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

నేత్రపర్వంగా భోగి తోట ఉత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో కొలువైన ఆండాళ్ అమ్మవారి భోగి తోట ఉత్సవాన్ని కనులపండువగా శుక్రవారం నిర్వహించారు. ప్రత్యేక పల్లకిపై అమ్మవారిని కొలువుదీర్చి నవాబుపేటలోని బుజ్జమ్మతోట వరకు ఉత్సవాన్ని జరిపారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్‌లో పోస్టులకు నోటిఫికేషన్

నెల్లూరు(మినీబైపాస్): అగ్నిపథ్‌లో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు (మెడికల్ అసిస్టెంట్) గ్రూప్ – వై కేటగిరీలో ఉద్యోగాల ఎంపికకు నోటిఫికేషన్‌ను కమాండింగ్ ఆఫీసర్, రిక్రూటింగ్ ఆఫీస్, సికింద్రాబాద్ వారు విడుదల చేశారని సెట్నెల్ సీఈఓ పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ బైపీసీలో 50 శాతం లేదా ఫార్మసీలో డిప్లొమా లేదా డిగ్రీలో ఉత్తీర్ణులైన యువకులు అర్హులని తెలిపారు. 27 జూన్, 1999 నుంచి 27 జూన్ 2004 మధ్య జన్మించిన వారు అర్హులని చెప్పారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన వారు ఫిబ్రవరి 4, 5వ తేదీలు, ఫార్మసీ డిప్లొమా లేదా డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు ఫిబ్రవరి ఏడు, ఎనిమిదో తేదీల్లో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, తాంబరం, చెన్నైలో ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్‌కు హాజరుకావాలని కోరారు. ఆసక్తి గల వారు agnipathvayu.cdac.inలో నోటిఫికేషన్‌ను పరిశీలించాలని కోరారు. వివరాలకు 93453 77868 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కనులపండువగా కల్యాణోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రీగంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, అమ్మవార్లకు కుంకుమాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణ వేదికపై కొలువైన గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి

పేద మహిళలకు చీరల పంపిణీ



ముసునూరువారిపాళెంలో చీరలు పంపిణీ చేసిన నాయకులు



మనుబోలు: చీరలు పంపిణీ చేస్తున్న అధికారులు

ముత్తుకూరు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు నిరుపేద చల్లా యానాదుల మహిళలకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. మండలంలోని ముసునూరువారిపాళెంలో సర్పంచ్ మునుకూరు జనార్దన్‌రెడ్డి పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తాళ్లపూడిలో సర్పంచ్ మస్తానమ్మ, నాయకుడు పద్మనాభరెడ్డి గిరిజనులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిడూరుపాళెంలో..

మనుబోలు: మండలంలోని పిడూరుపాళెంలో చల్లా యానాదుల మహిళల కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అందజేసిన చీరలను ఎంపీడీఓ వెంకటేశ్వర్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకునేందుకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చీరలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏడెం మమత, ఈఓపీఆర్‌డీ రమణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏడెం మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ నువ్వూరు పద్మనాభరెడ్డి, జయశేఖర్‌రెడ్డి, పలగాని కృష్ణారెడ్డి, ఉగ్గుమూడి గోపీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రతిష్ట మరింత పెంచాలి

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు

కొడవలూరు: ప్రభుత్వ ప్రతిష్ట మరింత పెంచేలా గృహ సారథులు కృషి చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీలో కీలకంగా మారనున్నారని తెలిపారు. గృహ సారథులు వారి పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. అనంతరం సచివాలయ కన్వీనర్ల విభాగానికి మండల కన్వీనర్‌గా కొండా శ్రీనివాసులురెడ్డిని ఎంపిక చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్ బి.సుప్రియ, నాయకులు ఐ.సునీల్‌రెడ్డి, ఎం.రంగారెడ్డి, ఆర్.రాజేష్‌రెడ్డి, పి.సుభాష్‌రెడ్డి. పి.శ్రీనివాసులురెడ్డి, కాకి శ్రీనివాసులు, పి.మధుసూదన్‌రెడ్డి, కె.మోహన్‌రావు, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరి చలపతిరావు

రీ సర్వేను పక్కాగా నిర్వహించండి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా జరిగే భూముల రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ అధికారులకు సూచించారు. మండలంలోని చౌకచెర్ల, పార్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూముల రీ సర్వే కార్యక్రమం ద్వారా నిజమైన భూ హక్కుదారులకు న్యాయం జరుగుతుందన్నారు. గత 100 సంవత్సరాల నుంచి సర్వే జరగకపోవడంతో గ్రామస్థాయిలో భూసమస్యలు ఏర్పాడ్డాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూముల రీ సర్వే కార్యక్రమం ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్వోలు ఉన్నారు.



రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ శీనానాయక్

ముందస్తు సంక్రాంతి సంబరాలు



ముత్తుకూరు: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న యువతులు

ముత్తుకూరు: మండలంలోని తాళ్లపూడిలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగా గ్రామంలోని సచివాలయం ఎదుట సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మామిడిపూడి సర్పంచ్ మస్తానమ్మ, సచివాలయ కన్వీనర్ గౌస్‌బాషా, వీఆర్వో రమేష్, ఉప సర్పంచ్ గోపాల్, పంచాయతీ కార్యదర్శి అహమదున్నీసా, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజనకాలనీలో..

పొదలకూరు: మండలంలోని పులికల్లు గిరిజనకాలనీలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సర్పంచ్ జీవీ సుబ్బమ్మ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవి, నాయకుడు జి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): సంక్రాంతిని పురస్కరించుకుని విడవలూరు మండలంలోని వరిణి, దండిగుంట గ్రామాల్లో శుక్రవారం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వరిణి సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున్‌రావు, కోరమాండల్ సంస్థ మార్కెటింగ్ మేనేజర్ రాజారెడ్డి పాల్గొన్నారు.



ముత్తుకూరు: సచివాలయం వద్ద భోగి మంట వేస్తున్న ఉద్యోగులు



పొదలకూరు: గిరిజనకాలనీలో రంగవల్లులు వేసిన మహిళలు